క్లుప్తంగా

కలెక్టర్‌కు ఫిర్యాదు

కొణిజర్ల: తమ భూములను తమ అనుమతి లేకుండా అక్రమంగా సర్వే చేస్తున్న అధికారులను వెంటనే నిలిపివేయాలని సోమవారం రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఓ ప్రైవేట్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి తమ భూములను కట్టబెట్టడానికి ప్రభుత్వ అధికారులు అక్రమంగా సర్వేలు చేస్తున్నారని మండలంలోని అంజనాపురం గ్రామస్తులు తెలిపారు. మాకు జీవనోపాధి అయిన ఈ భూమిని మేము ఆయిల్ ఫ్యాక్టరీకి ఇవ్వమని తేల్చి చెప్పిన వినకుండా సర్వే చేస్తున్నారని దీనిపై విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీహెచ్ కవిత, రోశయ్య, కృష్ణ కుమారి, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, లక్ష్మయ్య, నాగమణి, రాంబాబు, సురేష్, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చప్టాకు మరమ్మతులు చేయాలని వినతి

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట రహదారిపై ఉన్న కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని మండల ఎంపీపీ వరలక్ష్మి జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏన్కూరు టు డోర్నకల్ రహదారిలో తూతకలింగన్నపేట వద్ద ఉన్న చప్టా ప్రమాదబరితంగా ఉందని, వర్షకాలం వచ్చిందంటే చెరువు అలుగు వలన వరదనీరు చేరి చప్టా కోతకు గురైతుందన్నారు. దీనికి మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తప్పవు

వైరా: అనుమతి లేకుండా వాహనాలపై అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వైరా ఎంవీఐ బాదావత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం వైరాలోని ఎంవీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధిర సమీపంలోని ఏపీ నుంచి తెలంగాణకు అనుమతి లేకుండా వాహనాల ద్వారా ఇసుకను తరలిస్తున్న 4 లారీలను సీజ్ చేసి ఒక్కో వాహనానికి రూ.లక్ష జరిమానా విధించామని తెలిపారు. ఈ లారీలను బోనకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ముదిగొండ: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ముదిగొండలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ ముదిగొండ మండల సమావేశం కన్వీనర్ కల్యాణ్ మాట్లాడుతూ.. 22రోజులుగా వీఓఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే వారికి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దామోదర్, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బాస్కర్‌రావు, ఉపేందర్‌రావు, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు బట్టు రాజు, తేరాల నాగేశ్వరరావు, ప్రభాకర్, నాగేంద్రబాబు, వీఓఏలు పాల్గొన్నారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూం ప్రారంభం



బజాజ్ షోరూంను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని తోట రమేష్ టవర్స్‌లో సుమారు రూ.10 కోట్లతో ఏర్పాటు చేసిన బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంను మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమా మహేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలారాణి, కమిషనర్ కె.సుజాత జ్యోతి ప్రజ్వలన చేశారు. అన్ని వర్గాలకు వివిధ రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు అందుబాటు ధరలో ఉంచటం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఇన్‌చార్జ్ మహ్మద్ రమీజ్, తోట రమేష్, తోట గణేష్, నరుకుళ్ల శ్రీను, నర్సింహారావు, హరి, అబ్దుల్లా పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని ఆదరణ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. సోమవారం ప్రముఖ న్యాయవాది శీలం చెన్నారెడ్డి, జ్యోతి దంపతుల కుమారుడు ఎన్ఆర్ఐ శీలం మణికాంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకురాలు నిస్సి హరిణి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక

ఏన్కూరు: మండలంలోని తిమ్మారావుపేట రైతువేదికలో మంగళవారం డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తహసీల్దార్ ఎస్కే ఖాసీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మారావుపేట, ఎర్రబొడుతండ పంచాయతీలోని అర్హులైన లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో ఇళ్లను అందజేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10:30 గంటలకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు

- బాగుపడుతున్న పంట కాల్వలు
- కూలీలకు కనీస సౌకర్యాలు కరువు
- రోజుకు రూ.270 మాత్రమే వేతనం
- అవి కూడా ఆలస్యమే..



తల్లాడ మైనర్ కాల్వలో పూడిక తీత, చెత్త తొలగింపు పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

తల్లాడ: జాతీయ ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వేసవి కాలం కావటంతో పంట కాలువల మరమ్మతులు ఊపందుకున్నాయి. ఎన్ఆర్ ఈజీఎస్ పనులతో ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని పంట కాలువలు బాగుపడుతున్నాయి.

రోజుకు 2,200 మంది కూలీలు..

తల్లాడ మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో పనులు ప్రారంభమయ్యాయి. రోజుకు 2,200 మంది కూలీలు హాజరౌతున్నారు. ఈ నెల 15 కల్లా కూలీల సంఖ్య రెట్టింపయ్యే అవకాశాలున్నాయి. రోజు, రోజుకు కూలీల సంఖ్య పెంచే దిశలో అధికారులు కృషి చేస్తున్నారు.

ఏళ్ల సమస్యలు పరిష్కారం..

రాష్ట్ర ప్రభుత్వం నాగార్జున సాగర్ కాల్వలకు గత తొమ్మిదేళ్లగా నిధులు కేటాయించక పోవటంతో అధ్వానంగా తయారయ్యాయి. కాల్వల్లో పూడిక పేరుకు పోయి, చెత్త చెదారం, కంపచెట్లు, పిచ్చి మొక్కలు, తీగ అల్లుకు పోయింది. ఉపాధి కూలీలు కొడవళ్లు, గొడ్డళ్లు, గడ్డపారలతో కాల్వలను శుభ్రం చేస్తున్నారు. సిరిపురం మేజరు కాల్వల కింద ఉన్న మైనర్లు, సబ్ మైనర్ కాలువలకు గత వారం రోజులుగా మరమ్మతు పనులు చేపట్టారు. అలాగే రామచంద్రాపురం, 1,2 మేజర్లు, పుణ్యపురం మేజర్ల కింద ఉన్న మైనర్, సబ్ మైనర్ కాల్వల్లో కూడా పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ పనులత పాటు ఫారం ఫాండ్ పనులు కూడా జరుగుతున్నాయి. ఉపాధితో కాల్వల రూపు రేఖలు మారుతున్నాయి.

2 లక్షల 50 వేల పనిదినాలు లక్ష్యంగా ..

మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది మొత్తం 2లక్షల 50 వేల పనిదినాలు లక్ష్యంగా ఎన్ఆర్ ఈజీఎస్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు మండలంలో 15,748 పని దినాలు పూర్తయ్యాయి. జూన్ 10వ తేదీలోగా లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంది. ఆ తర్వాత ఒక వేళ పనులు చేయాలనుకున్న వర్షాలు వల్ల పనులు సాగవు. లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇంకా 33 రోజులు మాత్రమే గడువుంది. ఈ గడువులోగా ఎన్ని పనిదినాలు పూర్తవుతాయో వేచి చూడాల్సి ఉంది.

రోజుకు రూ.270 కూలీ మాత్రమే..

ఉపాధి కూలీలు రోజుకు ఆరు గంటలు పని చేస్తే రూ.270 మాత్రమే వేతనం పడుతుంది. 4, 5 గంటలు మాత్రమే పనులు చేస్తే రూ.200 మాత్రమే కూలీ పడుతుంది. ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనులు చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కూలీలకు నీడ కోసం టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి.

వేతనాలు పెంచాలి..



ఉపాధి కూలీలకు రోజుకు ఆరు గంటలు పని చేసినా రూ.270 మాత్రమే కూలీ పడుతుంది. వేసవి కాలంలో ఈ వేతనాన్ని డబుల్ చేస్తేనే గిట్టుబాటవుతుంది. రోజుకు కిలో మీటర్ దూరం నడిచి వచ్చి కాలువ పనులు చేస్తున్నాం. అయినా అరకొరగానే వేతనాలు ఇస్తున్నారు.

– తాటికొండ లీలావతి, తల్లాడ

పనిముట్లు సరఫరా చేయాలి..



గత 20 ఏళ్లుగా పనులు చేస్తున్నా పని ముట్లు సరఫరా చేయడం లేదు. పారలు, గడ్డ పారలు లేక సొంతంగా చేయించుకొని ఇంటి వద్ద నుంచి ప్రతి రోజు మోసుకొని రావాల్సి వస్తోంది. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. నీడ, తాగు నీరు కల్పించాలి.

– బొడ్డు కృష్ణ, తల్లాడ

వసతులు కల్పిస్తాం..



మండలంలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. పని ప్రదేశాల్లో తాగునీటిని అందించేందుకు ఆయా గ్రామ పంచాయతీలకు ఆదేశాలిచ్చాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ఉదయం 6:30 గంటలకే కూలీలు పనిలోకి వెళ్లాలి. వేతనాలు సకాలంలో అందేందుకు కృషి చేస్తాం.

– ఎంపీడీఓ బి.రవీంద్రారెడ్డి, తల్లాడ

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



మధిర: కిట్లను అందజేస్తున్న వైద్య సిబ్బంది

మధిర: మండలంలోని దెందుకూరు ఆస్పత్రిలో టీబీ పేషంట్లకు న్యూట్రిషన్ కిట్లను సోమవారం ఉచితంగా అందించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎంపీ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా క్షయ వ్యాధిగ్రస్తులకు అందించడం జరుగుతున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు పృథ్వీ నాయక్ మాట్లాడుతూ.. ప్రజలందరూ క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి సకాలంలో మందులు వాడి బలమైన ఆహారం తీసుకుంటే ఈ వ్యాధిని నియంత్రించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గోలి రమాదేవి, సందీప్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు టీబీ వ్యాధిపై అవగాహన..

కల్లూరు: కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వారి నెలవారి వైద్య సేవలలో భాగంగా డాక్టర్ నవ్యకాంత్ టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు వారాల పైబడి కళ్లెంతో కూడిన దగ్గు రావడం, సాయంత్రం సమయంలో చెమటలు పట్టడం, జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం లక్షణాలు కన్పించినట్లెతై దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధికి సంబంధించిన మందులు, పరీక్ష పూర్తిగా ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ వై.సురేష్, పీహెచ్ఎన్ జయశ్రీ, హెల్త్ విజిటర్ విజయశ్రీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణంలో అవినీతి



డబుల్ ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

మధిర: డబుల్ బెడ్‌రూం ఇళ్లను నాసిరకంగా నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌తో పాటు వారికి సహకరిస్తున్న అధికారులపై కూడా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మధిర మండలం ఇల్లూరు గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను సోమవారం వారు పరిశీలించారు. సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 30 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ దశలోనే బేస్మెంట్‌కు లోపల మట్టికి బదులు పత్తి కట్టె, చెత్తాచెదారంతో నింపారని ఆరోపించారు. దీనివల్ల పిల్లర్లు గాలికి ఊగుతున్నాయని, స్లాబులు కురుస్తూ పెచ్చులు ఊడుతూ దర్శనమిస్తున్నాయన్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పాటు అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరాయని తెలిపారు. కొన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా మరికొన్ని బేస్మెంట్ లెవల్ లోనే ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తేలప్రోలు రాధాకృష్ణ, వడ్రాణపు మధు, కిరణ్, నాగేశ్వర్, రవి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

పెనుబల్లి : ఉపాధిహామీ కూలీలకు వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పని ప్రదేశాలను ఆ సంఘం సభ్యులతో ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండాలపాడులో ఉపాధిహామీ కూలీలను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కూలీల బిల్లులను వెంటనే చెల్లించాలని, 200ల రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 లు కూలీ చెల్లించాలని, పని ప్రదేశాల్లో టెంట్లుతో పాటు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వైఖరిని మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.స మండల అధ్యక్షుడు గాయం తిరుపతిరావు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కల్లూరు: కల్లూరు పెద్దచెరువు కట్టమీద శ్రీ శివాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కల్లూరు పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి మంచాల రత్నం, భారతి దంపతులు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు యలమచంలి సత్యశివకుమార్, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, దాతన్యాసం, గోపూజ, మహాసంకల్పం, యంత్రస్థాపనం, మూర్తి స్థాపనం, మహాపూర్ణాహుతి, శాంతి కల్యాణం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారావు, కార్యదర్శి సూర్యనారాయణ, కమిటీ సభ్యులు రామారావు, మాధవరెడ్డి, మోహన్‌రావు, కృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



రేమిడిచర్లలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: సీఎం కేసీఆర్ ప్రభుత్వం తీరును నిరసిస్తూ సోమవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సెల్ నాయకుడు కోటపాటి పాండు రంగారావు, నాగిరెడ్డి శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల వెంకటనర్సయ్య, పిల్లి బోస్, కోటపాటి పూర్ణ, సూరంశెట్టి రాజేష్, దేవరకొండ ఏడుకొండలు ఆశీర్వాదం తదితరులు ఉన్నారు.

పీపుల్స్ మార్చ్ సభకు వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



కారేపల్లి నుంచి బహిరంగ సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కారేపల్లి: హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా.. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ బహిరంగ సభకు కారేపల్లి మండలం నుంచి సోమవారం కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కారేపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి సినిమాహాల్ సెంటర్ వరకు కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించి, అనంతరం వాహనాల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మేదరి టోనీ వీరప్రతాప్, భీముడు నాయక్, తాజుద్దీన్, హీరాలాల్, బొళ్ల రమేష్, వినోద్, బాలునాయక్, రామారావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ప్రారంభం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ దానియేలు

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక సర్పంచ్ తడికమళ్ల దానియేలు, ఎంపీటీసీ సభ్యురాలు వడ్డె రమాదేవి సోమవారం ప్రారంభించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో సుమారు 10 రోజుల పాటు గ్రామస్తులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు ప్రత్యేకాధికారి రిషిత, డీఈఓ నీరజ, జ్యోతి, నోడల్ పర్సన్ జన్ను జాన్సన్, హెచ్ఈఓ రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



వైరా: కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రాములు నాయక్

వైరా: తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొణిజర్ల మండలానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పలువురి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 75 సంవత్సరాల పాలకుల పాలనలో తెలంగాణ రాష్ట్రం పూర్తిగా వెనకబడి పోయిందన్నారు. తెలంగాణ సంక్షేమ పథకాలు పక్క రాష్ట్రాలు కూడా కాపీ కొడుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రధానమంత్రి పదవి అతి దగ్గరలోనే ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని సూచించే విధంగా తెలంగాణ సచివాలయాన్ని తీర్చి దిద్దారన్నారు. అనంతరం 52 మంది లబ్ధిదారులకు రూ.52,06,200 ల చెక్కులను అందజేశారు. తహసీల్దార్ దొడ్డారపు సైదులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కొణిజర్ల మండల బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు వై.చిరంజీవి, ఏలూరి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి..

కొణిజర్ల: మండలంలోని రాజ్యాతండా పంచాయతీలో గల ప్రగతి నగర్ కాలనీలో మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ స్థానిక వార్డు సభ్యురాలు అబ్బూరి విజయకుమారి నేతృత్వంలో కాలనీ వాసులు సోమవారం వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌కు వినతిపత్రం అందించారు. గత 10 ఏళ్లుగా కాలనీ వాసులు నివాసం ఉంటూ ఇంటి పనులు సకాలంలో చెల్లిస్తున్నారన్నారు. ఇక్కడ రోడ్డు సౌకర్యం, మిషన్ భగీరథ తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నా వీధి దీపాలు ఏర్పాట చేయలేదన్నారు. మా సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే కొణిజర్ల ఎంపీడీఓ, రాజ్యాతండా పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు జాన్ ప్రసాద్, ప్రసాదరావు, పల్లవి, ఇందిర, సుగుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నకిలీవిత్తనాలు విక్రయించొద్దు..



ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సత్తుపల్లి ఏసీపీ రామానుజం

ఏన్కూరు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తుపల్లి ఏసీపీ రామానుజం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, సిబ్బంది పనితీరు, కేసులు వివరాలు పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు వచ్చి విత్తనాలు, పురుగుమందులు అమ్మితే రైతులు కొనవద్దన్నారు. పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రైతులు విత్తనాలు, పురుగుమందులు దుకాణాల్లో కొనుగోలు చేసి బిల్లులు భద్రపరుచుకోవాలన్నారు. గ్రామాల్లో దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రవి, సిబ్బంది శ్రీను, రమేష్, వెంకట్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం..

సత్తుపల్లిటౌన్: ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తుపల్లి యువభారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సోమవారం కల్లూరు ఏసీపీ రామానుజం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం.. అలానే తలసేమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకుడు క్రాంతిని అభినందించారు. ఫౌండర్ క్రాంతి మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారులకు సమయానికి రక్తం అందించాలనే ఉద్దేశ్యంతోనే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువభారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు, రక్తదాతలు పాల్గొన్నారు.

కిష్టారం ఓసీలో ఈద్ మిలాప్ కార్యక్రమం

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం ఓసీలో ముస్లింలు ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ముస్లి సోదరుల ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి గద్దె మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పీఓ ఎం.వీ.నరసింహారావు, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ రజాక్, మేనేజర్ బి.రామకృష్ణ, అబ్దుల్ బషీద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముస్లింలు నెలరోజుల పాటు చేపట్టిన ఉపవాస దీక్షల అనంతరం సంతోషంగా చేసుకొనే పండుగ ఈద్ మిలాప్ అని అన్నారు. ప్రతి ఒక్క మనిషి మానవత్వముతో జీవించాలని, కుల, మతాలకతీతంగా మానవ జీవిత మర్మాన్ని వివరించే ఖురాన్ గ్రంథం అవతరణ ప్రారంభమైన నెల రంజాన్ మాసం అన్నారు. సింగరేణి వ్యాప్తంగా దసరా, క్రిస్మస్, రంజాన్ పండుగలన్నీ కూడా అత్యంత వైభవంగా నిర్వహించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ సందిరి శ్రీనివాస్, రమేష్, అశ్వక్, ఫిట్ సెక్రటరీలు అఫ్రోజ్, సుధాకర్, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, బాలాజీ, రాజశేఖర్, భాస్కర్, వెంకటేశ్వర్లు, హరి, బాలయోగి, నర్సింహారాజు, నజీర్, హమీద్, అన్వర్ అశోక్, షుక్రు, రాంసాగర్, వెంకటరమణ, సాయికృష్ణ, శ్రీనివాస్, ఏసుపాదం, కనకరాజు, కుమారస్వామి, శ్రీను, సాంబశివరావు, భద్రు, ఈశ్వరయ్య, కోటేష్ దావూద్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లు విధుల్లో చేరాలి



ఎర్రుపాలెం ఎంపీడీఓ శ్రీనివాసరావు

కొణిజర్ల/ఎర్రుపాలెం/తల్లాడ: గత 10 రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 9న మంగళవారం సాయంత్రం 5 గంటల లోగా విధుల్లో చేరాలని ఎంపీడీఓలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కొణిజర్ల, ఎర్రుపాలెం, తల్లాడ ఎంపీడీఓలు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, రవీంద్రరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విధుల్లో చేరని జేపీఎస్‌లను ఉద్యోగం నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. కావున జేపీఎస్‌లు సమ్మె విరమించి విధుల్లో చేరాలన్నారు.

ఉత్తమ సేవకుడు రమేష్‌కు అభినందనలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్(ఎన్ఏఏసీ) అడ్వైజరీ కమిటీ మెంబర్ పీవీ రమేష్‌కు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు. కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) వారు ఈ నెల 6వ తేదీన హైద్రాబాద్‌లోని టీ-హబ్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఉన్నత విద్యాసంస్థల్లో నాణ్యతను పెంపొందించడంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందచేశారని యాజమాన్యం తెలిపింది. రమేష్ సమర్థవంతంగా సేవలందిస్తున్నందుకు సాయిస్ఫూర్తి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యాజమాన్యం సోమవారం కళాశాలలో ప్రశంసించింది.

14న హనుమత్ జయంతి ఉత్సవాలు

కల్లూరు: ఈ నెల 14న శ్రీ హనుమత్ జయంతి ఉత్సవాలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 14న సంతాన వేణుగోపాలస్వామి దేవాలయం, శివాంజనేయ స్వామి దేవాలయాల మీదుగా ద్విచక్ర వాహనాలతో సమతా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం 'సువర్చలా సహిత హనుమత్ కల్యాణ మహోత్సవం'అత్యంత వైభవంగా జరుపనున్నట్లు పేర్కొన్నారు. తర్వాత భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు హనుమత్ కల్యాణ మహోత్సవానికి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

సింగరేణి కార్మికులపై నిర్లక్ష్యం తగదు



కార్మికులతో మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

సత్తుపల్లిరూరల్: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం, సింగరేణి సంస్థ నిర్లక్ష్యం వహిస్తుందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. భయభ్రాంతులకు గురౌతున్న కార్మికులకు భరోసా కల్పించడం కోసం .. వాళ్ల సమస్యలు పరిష్కారం కోసం హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, సమంత ప్రాజెక్టులో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. 11వ వేజ్‌బోర్డు కాలయాపనకు గల కారణాలు తొత్తులుగా మారిన కార్మిక సంఘాల వైఖరిని వివరించారు. అంతేకాకుండా వందల కోట్లు వెచ్చించి నడుపుతున్న సమంత ప్రాజెక్టులో కార్మికులకు సరైన కనీస సౌకర్యాలు కూడా మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేయకపోతే అడగడం చేతకాని సంఘాలు అది పొడుస్తాం.. ఇది పొడుస్తాం.. అని మాయ మాటలతో కార్మికులను మోసం చేయడాన్ని కార్మికలోకం తా గమనిస్తుందన్నారు. రాబోయే కాలంలో వీరికి తగిన బుద్ధి చెప్పాలని కార్మికులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, బ్రాంచ్ సెక్రటరీ ఆసీఫ్, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ గోద రమేష్, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ మెంబర్ నసీంఖాన్, సత్తుపల్లి నాయకులు అజ్గర్ ఖాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.